

# మూడో సీతకథ

బ్రాహ్మణ పిల్ల

– భువనచంద్ర



*(గత సంచిక తరువాయి)*

**పుణ్యదంపతులు**

పోస్టాఫీసునించి వేములపల్లి రామారావు వచ్చాడు. అతను పోస్ట్ అండ్ టెలిగ్రాఫ్ (తంతి - తపాలా సంస్థ) డిపార్ట్‌మెంట్‌లోనే పనిచేస్తాడు. పోస్ట్‌మేన్‌గా ఉద్యోగం వచ్చి చదువు ఆపుచేశాడు. అందరి మంచీ కోరుకునేవాడు. అందరికీ తలలో నాలుకలాంటివాడు. తలుపు తీశాను.

"టెలీగ్రామ్ సీతా" అన్నాడు. కంగారుగా చదివాను. 'మదర్ సీరియస్ స్టార్ట్ ఇమ్మీడియట్లీ' అని వుంది. కింద పేరు చూస్తే మా పెద్దమామయ్య సూర్యనారాయణది.

"అమ్మా" గబగబా లోపలికెళ్ళాను. మా అమ్మతో విషయం చెప్పగానే ఆవిడ భోరుమంది. ఆ కాలంలో టెలిగ్రాం అంటే నూటికి తొంభై వంతులు విషాదకరమైన వార్తని మోసుకొచ్చేదే గ్రీటింగ్ టెలిగ్రాం వాడకం అతి తక్కువ.

"పిన్నిగారూ.. మీ అమ్మగారికి అనారోగ్యమనే కదండీ వుంది. కంగారుపడకండి. పన్నెండింటికి ఎక్స్‌ప్రెస్ బస్సెక్కితే ఏలూరు వెళ్ళడం ఎంతసేపూ!" ఓదారుస్తూ అన్నాడు వేములపల్లి రామారావు.

"అవునమ్మా.. నాన్నని తీసుకొచ్చేస్తా. నువ్వు కంగారుపడకుండా బట్టలు సద్దెయ్" అన్నాను మా అమ్మని ఓదారుస్తూ.

వెక్కుతూనే లేచింది. బయటికొచ్చి రామారావుకి టెలిగ్రాం ముట్టినట్టుగా సంతకం పెట్టాను.

"నేను ఇప్పుడే వెళ్ళి మీ నాన్నగారిని ఇంటికి పంపిస్తాను సీతా. నువ్వు కూడా ప్రయాణం ఏర్పాట్లు చూసుకో!" అన్నాడు రామారావు సైకిలెక్కుతూ.

అప్పుడు ఎక్కువగా ట్రంకు పెట్టెలు వాడేవాళ్ళు. ఇవ్వాళ వున్నన్ని ట్రావెల్ బేగ్స్, వి.ఐ.పిలాంటి సూట్‌కేసులూ ఆనాడు లేవు. కొన్నైతే తేలికపాటి చెక్కతో చేసి పైనా లోపలా రెక్సిన్‌లాంటి కవర్స్‌తో చెక్క కనపడకుండా సూట్‌కేసులు తయారు చేసేవాళ్ళు. కానీ వాటికి పెద్దగా గిరాకీ వుండేదికాదు. కారణం 'లాక్స్' చెడిపోతాయని. ట్రంకు పెట్టె అయితే, దశాబ్దాలయినా చెడదుగదా!

గొప్పగొప్పవాళ్ళయితే లెదర్ సూట్‌కేసులు వాడేవాళ్ళు. అదో గొప్ప హోదా. అలాగే దూరప్రయాణాలకీ, రాత్రుళ్ళు ఉపయోగించడానికీ 'హోల్డ్ఆల్స్' అనేవి వుండేవి. ఓ పలుచని తేలికపాటి దూది పరుపేగాక బట్టలు, దుప్పట్లూ, తువ్వాళ్ళూ అన్నీ అందులో నీటుగా సద్ది దాన్ని 'రోల్' చేసి బెల్టులు బిగిస్తే నా సావిరంగా ఆ స్టైలు మహా 'ఇదిగా' వుండేది. అయితే దాన్ని మొయ్యడానికి కూలీలు కావాలి. అయినా అప్పుడు కూలీ ఎంతా..? మహా అయితే అణానో బేడానో!

మా నాన్నగారికి వుంది ఓ బెడ్ హోల్డాల్. మొత్తానికి దాన్నికూడా కిందకి దించి, దానిలోనూ, ఓ ట్రంకు పెట్టెలోనూ మాకు కావాల్సిన బట్టల్ని నేనూ మా అమ్మా సద్దేశాం. అరగంటకల్లా మా నాన్న వచ్చేశాడు.

నాన్నని చూడగానే అమ్మ మళ్ళీ ఏడుపు మొదలెట్టింది. "చూడూ..సీరియస్ అనేకదా వాళ్ళు మనకి టెలిగ్రాం ఇచ్చిందీ? నువ్వు ఏడిస్తే అది అశుభసూచకం అవుతుంది" అన్నాడు నాన్న.

"అవునే అమ్మా.. నువ్వే చెబుతావుగా పైన 'తథాస్తు' దేవతలు వుంటారని." నేనూ అన్నాను. మా అమ్మని వూరుకోబెట్టాలంటే 'తథాస్తు'దేవతల సహాయం తీసుకోక తప్పదు మరి. మరో అరగంటలో ఏలూరు వెళ్ళే బస్సులో వున్నాం.

(ఇప్పట్లాగా ఆ రోజుల్లో గంటకో బస్సు వుండేది కాదు. APSRTC 11th జనవరి 1958లో స్టార్ట్ అయినా, అంతకుముందు అది నిజాం రైల్ & రోడ్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్. ఏలూరికి మా వూరికి కాశయ్యగారి ప్రయివేటు బస్సే పొద్దున్నా సాయంత్రం తిరిగేది. ఒక్క బస్సు మాత్రం ఎక్స్‌ప్రెస్ పేరుతో మధ్యాహ్నం మా వూరి నించి ఏలూరికి తిరిగేది. అదీ ఒక్కసారే. ఏలూరినించి మా వూరొచ్చి మళ్ళీ ఏలూరికి వెళ్ళిపోవడం అన్నమాట. పేరు ఎక్స్‌ప్రెస్ అయినా ఆ అధ్వానం రోడ్డు మీద అది 'ఇస్సో ఉస్సో' అంటూ రెండున్నరా మూడు గంటలకి ఏలూరు చేరేది.)

ఏలూర్లో రిక్షా ఎక్కి మా మేనమామల ఇంటికి చేరాం. అమ్మమ్మని నేలమీద పడుకోబెట్టారు. అదీ ఇంటిముందు వేసిన పాకలో చాప, దిండు ఉన్నాయి. మా అమ్మని చూస్తూనే అమ్మమ్మ కళ్ళు బల్బుల్లా ఒక్కసారి వెలిగాయి. లేచే ప్రయత్నం చేస్తూనే పడిపోయింది. మళ్ళీ డాక్టర్‌కి కబురెళ్ళింది. ఆయన వచ్చి పల్స్ చూసి 'సారీ' అన్నాడు. అందరూ ఒక్కసారిగా ఘొల్లుమన్నారు. కళ్ళముందే ఓ జీవి కదిలిపోవడం చూడ్డం నాకు మొదటిసారి. మా క్లాస్‌మేట్ పోయినపుడు బాడీనే చూశాంగానీ, ఇలా ప్రాణం పోవడం' చూడలేదు.

దేవుడా! పోయినవాళ్ళ సంగతి అలా వుంచు. బ్రతికి వున్నవాళ్ళ వేదన చెప్పనలవిగాదు. దుర్భరం. మా అమ్మని వూరడించడం ఎవరివల్లా కాలేదు. మావయ్యలందరూ మూగవాళ్లైపోయారు. మా తాతగారు మాత్రం తలవంచుకుని చాలాసేపు మౌనంగా వుండి, ఆ తరవాత అన్నారు, "ఒరే సూర్యనారాయణా, మీ అమ్మ చచ్చిపోయిందిరా! మరి పంపించిరావాలిగా!" అన్నారు. ఆ మాట అన్నాక ఆయన కళ్ళవెంట ధారగా కన్నీళ్ళు. అప్రయత్నంగా వెళ్ళి ఆయన భుజాల్ని గట్టిగా పట్టుకున్నా. ఆయన బాధతో ఒణికిపోవడం నాకు తెలుస్తోంది.

*ఓ మౌనమా.. నీ అంతమాటకారి ఎవరూ!*

ఆ రోజే అంత్యక్రియలు పూర్తి చేశారు. కారణం రాత్రి పోతే తప్ప 'శవాన్ని' రాత్రికి ఉంచకూడదుట. అప్పటిదాకా విశాలాక్షమ్మగా, విశాలగా పిలవబడ్డ అమ్మమ్మ శ్వాస ఆగగానే 'శవం' అయిపోయింది. "'శవానికి' స్నానం చేయించండి" "శవాన్ని యీ పాడెమీద పడుకోబెట్టండి" etc.. etc..etc. ఎంత విచిత్రమైందీ జీవితం. మగవాళ్ళు మాత్రం స్మశానానికి వెళ్ళారు. ఆడవాళ్ళని రానీయలేదు. అంతేకాదు.. మగవాళ్ళు వచ్చేలోగా మేమందరం తలస్నానాలు చేసి, శవాన్ని ఉంచిన చోటునీ ఇంటినీ కూడా పసుపునీళ్ళతో శుద్ధిచేసి, అక్కడో దీపం పెట్టాలనీ పాలు వుంచాలనీ కూడా చెప్పి వెళ్ళారు. బోలెడు పద్ధతులు.

"కనీసం చివరి చూపైనా దక్కింది నీకు భాగ్యలక్ష్మీ" ఓదార్చింది మా పెద్దత్తయ్య అమ్మని. కానీ వరదలా వచ్చే దుఃఖం ఓదార్పులనే చేలగట్లకి ఆగుతుందా!

పక్కింటివాళ్ళు అందరికీ సరిపోయేంత ఉప్మానీ, ఇడ్లీ చెట్నీలని పంపించారు. శవం ఉన్నంతసేపూ వీధి వీధంతా వంటలూ, తినడాలూ బంద్. పొయ్యి వెలిగించకూడదు గనక ఇరుగూ పొరుగూ కాస్త 'తొలిమైల' దాటేదాకా తిండీ తిప్పల విషయం చూడడం సహజంగా అన్ని వూళ్ళల్లోనూ జరిగేదే

రాత్రంతా మరి అమ్మమ్మ తాలూకు కబుర్లతోనే గడిచింది. అంటే, జ్ఞాపకాల్లోనే ఆవిడ మిగిలి ఉందని నాకు అర్ధమైంది. కొడుకులు తల్లిని తల్లి వంటనీ, ఆవిడ ప్రేమనీ జ్ఞాపకం చేసుకుంటే, కోడళ్ళు అత్తగారి మంచితనాన్నీ ఆవిడ తమని తీర్చిదిద్దిన విధానాన్నీ చెప్పుకొచ్చారు. మా అమ్మ మాత్రం సైలెంటైపోయింది. మా తాతగారు ఒక్క ముక్క కూడా మాట్లాడలేదు. పక్కింటివారు పంపిన టిఫిన్లని నేనే అందరికీ వడ్డించి, బలవంతంగా తినిపించాను. మరి అమ్మ వొద్దంటే, "నేను తినకపోతే నువ్వెంత బాధపడతావో, నువ్వు తినకపోతే పైనించి అమ్మమ్మా అంతే బాధపడుతుంది" అని ఒప్పించాను.

ఇక తాతగారు పెట్టింది తిన్నారుగానీ, ఆయన యీలోకంలో వున్నట్టులేరు. మా నాన్నకి ఓదార్చడాలూ ఇవేమీ తెలీదు. ఆయన ఓ విధంగా పెద్దవాళ్ళల్లో చిన్నపిల్లాడు. ఏదో ఆలోచిస్తూ వున్నాడు. బహుశా చనిపోయిన మా తాతయ్య బామ్మలగురించి అయిండొచ్చు. ఈసారి నాన్న చిన్నతనం గురించీ, విద్యార్థి దశ గురించీ అడిగి తెలుసుకోవాలనుకున్నాను.

***ప్రతి మనసూ కొన్ని వేల గదులున్న మహా సౌధంలాంటిదే. కొన్ని తలుపులు తెరుచుకుని ఉంటే, కొన్ని ప్రహరీగోడల మధ్య తాళాలు వేసుకుని వుంటాయి. ప్రవేశిస్తేగానీ లోపల ఏముందో ఎవరికీ తెలీదు.***

'ఆహార నిద్రా, భయ, మైథునాలు సర్వజీవలక్షణాలని పురాణం శాస్త్రిగారు చెబితే విన్నాను. ఇప్పుడు చూస్తున్నాను. అర్ధరాత్రి దాటేలోగా కొంతమంది, దాటాక కొంతమందీ నిద్రాదేవి ఒడిలోకి సోలిపోయారు. దుఃఖం ఎంత పెద్దదయినా నిద్రముందు ఓడిపోక తప్పదు. మేలుకుని ఉన్నది మాత్రం నేనూ, మా నాన్న.

"నిద్రపట్టడంలేదా నాన్నా?" మెల్లగా అడిగాను. ఆయన సుదీర్ఘంగా నిట్టూర్చడం తప్ప మరేమి మాట్లాడలేదు. నేనూ మౌనంగా ఆయన పక్కన కూర్చున్నాను. ఎప్పుడు నిద్రపోయానో నాకే తెలీదు.

క్రితంసారి వచ్చినప్పుడు దోమలు పీక్కుతిన్నాయి. వాటి గొడవ, ఇంట్లో వాళ్ళ నిద్రలో పెట్టే ఘీంకారాలతో నిద్రపట్టలేదప్పుడు. నిన్న అసలు దోమల విషయమే జ్ఞాపకం రాలేదు. మనసు గనక గుర్తించకపోతే ఏదీ మనని బాధపెట్టలేదన్న విషయం అర్థమయింది. తన డ్యూటీ ప్రకారం సూర్యుడు యథాతథంగా నిర్వికారంగా, సహజమైన ఉత్సాహంతో ఉదయించాడు.

రాత్రి మనసుని వీడిపోయిన 'బాధ' కూడా తెల్లారాక అమ్మమ్మ పడుకునే నవారు మంచాన్ని చూడగానే మళ్ళీ మనసులో ఉదయించింది. ఏడుపుల బదులుగా మౌనం రాజ్యాన్ని నడుపుతోంది.

"ఎవరన్నా వంటవాళ్ళని మాట్లాడండి" మా పెద్దత్త పెద్దమామయ్యతో అన్నది. "వాళ్ళు మాత్రం ఎలా చేస్తారు? ఎక్కడేది వుందో వాళ్ళకేం తెలుస్తుందీ. పోనీ, యీ పదిరోజులూ హోటల్ నించి తెప్పిస్తా" నిర్లిప్తంగా అన్నాడు పెద్దమావయ్య.

"కూతురు కూతురికైతే మైలస్నానంతో సరి అంటారు. మీకేమీ అభ్యంతరం లేకపోతే సీత వంట చేస్తుంది. ఆ విధంగానన్నా మా అమ్మకి.." చెపుతూనే ఏడ్చింది మా అమ్మ.

"అది చిన్నపిల్ల" ఏదో అనబోయాడు రెండో మామయ్య.

"నేను చెయ్యగలను మామయ్యా. క్రితంసారి నేనూ పెద్దత్తా చేశాం. గుర్తులేదూ!" అన్నాను. మౌనం సంపూర్ణాంగీకారమైంది.

చక్కగా తలస్నానం చేసి వంటింట్లోకి వెళ్ళాను. బయట అంతా పురోహితులూ మంత్రాలూ, వారికి కావలసినది సమకూర్చడాలూ. పక్కింటి బామ్మగారు నాకు సహాయం వచ్చింది. అందరికీ సరిపడేంతగా ఎంత ఏది వండాలో పెద్దత్తని అడిగి తెలుసుకుంటూ వంట పూర్తిచేసేసరికి మధ్యాహ్నం రెండు గంటలయింది. వంట బాగుందా బాగోలేదా అని అడిగే సందర్భం కాదు. కానీ, వండినవన్నీ ఖర్చవడంతో వంట బాగానే వుందని అనుకున్నాను. భోంచేశాక "నాన్నా.. మీరు మనవూరు వెళ్ళిపొండి. భోజనానికి ఇబ్బందయినా, మొహమాటం లేకుండా ప్రశాంతంగా వుండగలరు" అన్నాను.

"వెళ్ళక తప్పదమ్మా. కొన్ని కేసులు అటెండ్ కావాలి" అన్నారు. సాయంత్రం బస్సుకి వెళ్ళిపోతూ నా చేతికో రెండొందలు ఇచ్చి, "కూరలూ అవీ యీ డబ్బుతోనే కొను" అన్నారు. ఆ రోజుల్లో రెండొందలు చాలా పెద్ద ఎమౌంటే. ఆయన్ని బస్స్టాండ్‌లో దింపి కూరగాయల మార్కెట్లో కూరగాయలు కొని, రిక్షాలో ఇంటికెళ్ళాను. పొద్దున్న పెద్దత్త చెప్పిన 'సుమారు' లెక్క కూరగాయలు కొనడానికి ఎంతో వుపయోగపడింది. 'పెద్దకర్మ' వరకూ వంటలు నేనే చేశాను. వంట చెయ్యాలనే ఉత్సాహం ఎంతవున్నా, అంతమందికి చేసేసరికి అలుపు వచ్చేది. వండి బయటపెడితే వడ్డనలు సంగతి మా అమ్మా, పెద్దత్తా చూసుకునేవారు. పెద్దకర్మకి మాత్రం వంటవారిని పిలిచారు.

వంట బ్రాహ్మడుకి ఇద్దరు పెళ్ళాలుట. కానీ ఇద్దర్లో ఎవరూ ఆయనకి సహాయం చెయ్యరుట. వాళ్ళ తగవులతో కొట్లాటలతో విసిగిపోయాడేమో, వంటచేసేటప్పుడు మాత్రమే ఉత్సాహంగా ఉంటాడుట. లేని సమయంలో దీనంగా, నిస్తేజంగా పడివుంటాడుట. ఈ 'ట' కారాలన్నీ చెప్పింది వంటాయన విధవప్పగారు. ఆవిడ పాపం తమ్ముడికి సహాయంగా వంటలకి వస్తుందిట.

వంటవాళ్ళు వచ్చినా, వారికి కావాల్సినవి అందించడం వగైరాతో ఆరోజు అవిశ్రాంతంగా గడిచింది.

"పోనీలే.. మీ అమ్మ రుణం చక్కగా, ఏ అడ్డం లేకుండా సవ్యంగా తీర్చుకున్నారు. మరి నా జీవితం ఎప్పుడు ముగుస్తుందో" దక్షిణ తాంబూలాలిచ్చి పురోహితుల్నీ, వంట బ్రాహ్మల్నీ పంపేశాక అన్నాడు మా తాతయ్య.

"ఆ మాట అనకునాన్నా" ఏడ్చింది మా అమ్మ. ఆ రోజు పొద్దున్నే మా నాన్న వచ్చారు.

"అన్నంత మాత్రాన జరిగిపోతుందటే? చచ్చేంతవరకూ చచ్చినట్టు బతకాల్సిందే! అయినా మరణం లేని జీవి ఏదీ లోకంలో! వస్తాం.. వెళ్తాం. ఇన్నేళ్ళు ఉండి ఠక్కున అది వెళ్ళిపోలేదూ? భాగ్యం, మీ అమ్మ పాడే "అంబంభజాం..జగదంబం భజాం" పాట నీకు గుర్తుందా? అవునూ, క్రితం నెలే చెప్పింది. సీతకేదో నగా నట్రా చేయించాలని. అదేమిటో నీకు చెప్పిందా? ఒరే, సూర్యనారాయణా.. మీ అమ్మ చీరెలన్నీ ఏం చేద్దామనుకుంటున్నావురా! ఏం చేసావూ... చనిపోయిన దాని చీరలు ఎవరు కట్టుకుంటారా? ఏమిటోరా.. ఏదో వెలితిగా వుంది. కాసేపు పడుకుంటా!" అంటూ పడుకున్నాడు తాతయ్య.

"పాపం.! భార్యపోయిన దుఃఖంలో ఆయన ఏం మాట్లాడుతున్నాడో ఆయనకే తెలీటం లేదు" అన్నారు మా మూడో మామయ్య మామగారు. ఆయన డిప్యూటీ తహసీల్దారుట.

రాత్రి భోజనాలు అయ్యాయి. పగటి భోజనాలయ్యే సరికే నాలుగయింది. రాత్రిభోజనాలు ఏం చేస్తాం. మిగిలిన వాటినే వాడాం. అన్నం మాత్రం వేడిగా వొండాము.

"ఇంతకీ మీ అత్తగారికి నగా నట్రా చాలానే వుందనుకుంటా. నీ పెళ్ళికొచ్చినప్పుడు చూశాను. చంద్రహారాలూ, నక్లెసులూ, వడ్డాణం, గాజులు అవీ బాగానే వున్నాయిగా!" యధాలాపంగా అన్నట్టు అన్నది మూడో అత్తయ్య తల్లి టిఫిన్ చేస్తూ. ఆవిడ రాత్రిళ్ళు టిఫినే తింటుందిట.

"చాలానే ఉన్నయ్యమ్మా" వినయంగా అన్నది భద్రావతి అత్త.

"ఏమిటో, ఆ వడ్డాణమూ చంద్రహారం సరిగ్గా నీకు సరిపోతయ్యే భద్రా. గాజులు గనక మారిస్తే భార్గవి పెళ్ళికి పనికొస్తాయి. " ఆరో చపాతీ నములుతూ అన్నదావిడ.

"అవి నీరజకీ నీహారికకీ ఇస్తానని ఎన్నోసార్లు చెప్పారు పిన్నిగారూ, ఆవిడ మాట చెల్లిస్తేనే ఆవిడకి ఆత్మశాంతి" లౌక్యంగా అన్నది శ్రీలక్ష్మి అత్తయ్య. అందరూ వింటూనే వున్నారు.

"ఇప్పుడు ఇవన్నీ... " గొంతుక్కి దుఃఖం అడ్డుపడి అన్నది మా అమ్మ "అదేమిటి భాగ్యం.. మీ అమ్మ నగల్లో నీకూ వాటా ఉంటుందిగా. అయినా, ఏ విషయమైనా అప్పటికప్పుడు తేల్చుకుంటేనే మంచిదమ్మా" లౌక్యంగా అన్నా నిక్కచ్చిగా అన్నది మా మూడో అత్త తల్లి. ఆవిడ పేరు ఐరావతి.

"చూడండి అమ్మా.. మా అమ్మగారి నగల విషయాలూ, మా ఆస్తుల విషయాలూ చూసుకోవడానికి అన్నదమ్ములం మేమూ, మా నాన్న ఉన్నాం. దయచేసి ప్రస్తుతానికి ఇవన్ని మాట్లాడుకోవడం బాగోదు." కొంచె అసహనంగా అన్నా స్పష్టంగా అన్నాడు మా పెద్ద మామయ్య. మా నాన్న ఆయన వంక మెచ్చుకోలుగా చూశాడు. నాకైతే పిచ్చి కోపం వచ్చింది. మనిషిలోని నికృష్టతత్వాన్నే లౌక్యం అంటారేమో అనిపించింది.

"అంతే అంతే. మీరన్నమాట ముమ్మాటికీ నిజం. ఏదో మాట వరసకి అన్నానుగానీ, ఇది సందర్భమా?" ప్రశ్నతోనే చర్చని ముగించింది ఐరావతి. "తను చెప్పదల్చుకున్నది కుండపగలగొట్టినట్టు చెప్పిందిగా లౌక్యురాలు" గుసగుసగా నాతో అన్నది మా పెద్దత్త. ఆవిడో అమాయకప్రాణి. భోజనాలు ముగిసేంతవరకూ మౌనం రాజ్యం చేసిందిగానీ, వాతావరణంలో ఓ ఇబ్బంది మాత్రం స్పష్టంగా తెలిసింది.

"సీతా అసలు ఇవ్వాళ రాత్రే బయలుదేరాల్సింది. రేపు సూర్యోదయానికి ముందే బయల్దేరి మనవూరు వెళ్ళాలి. తొందరగా పడుకో. మీ అమ్మని కూడా ప్రయాణానికి సిద్ధం చెయ్యి" మడతమంచం మీద నడుం వాలుస్తూ అన్నాడు మా నాన్న. జరిగిన సంభాషణ ఆయనకేమీ నచ్చలేదని అర్థమయింది. నయం... తాతగారు కాస్త పాలు తాగిపడుకున్నారు. ఆయన యీ మాటలు వింటే ఎంత బాధపడతారో అనిపించింది. రాత్రి పదిన్నరకి ఓసారి తాతగార్ని చూశాను. "కాస్త మంచినీళ్ళివ్వమ్మా" అన్నారు. ఇచ్చాను. ఆయన నీళ్ళు తాగినా కాఫీతాగినా వెండిగ్లాసులోనే తాగుతారు. "ఈ గ్లాసు నా పెళ్ళికి మీ 'అమ్మమ్మ వాళ్ళ తల్లిదండ్రులిచ్చిందే ఇంతకీ వాళ్ళెవరనుకుంటున్నావూ? నా మేనమామా మేనత్తే. మా అమ్మ నాన్నా చనిపోతే నన్ను వాళ్ళే పెంచి పెద్ద చేసి, పిల్లనిచ్చి పెళ్ళి చేశారు. ఏమిటో ... ఈ గ్లాసంటే మీ అమ్మమ్మకి ప్రాణం అనుకో. నన్ను తప్ప ఎవర్నీ ముట్టుకోనీయదు. ఇదిగో... ఇందాకనే పడుకున్నా సంభాషణలు నా చెవిన పడుతూనే వున్నాయి. ఈ గ్లాసు మాత్రం నువ్వే మా ఇద్దరి గుర్తుగా వుంచుకో. పిచ్చిపిల్లా. ఎంతవంట చేశావే.. పోమ్మా.. పోయి పడుకో." తలనిమిరి అన్నారు తాతయ్య.

ఎంత పిచ్చిదాన్ని. ఆయన పడుకున్నారనే అనుకున్నానుగానీ, ఐరావతిగారి గొంతు చిన్న సైజు లౌడ్ స్పీకర్ అని ఎందుకు గుర్తించలా? నగల పంపిణీ గురించి ఎంత బాధపడ్డారో.

మా అమ్మ పక్కన పడుకున్నాగానీ చాలాసేపు నిద్రపట్టలేదు. ఎప్పుడో పడుకున్నాను.

"లేమ్మా సీతా.. నాలుగంటలయింది" మా నాన్న నన్ను నిద్రలేపాడు. ఆయన అప్పటికే స్నానం చేసేసి వున్నారు. బావి నీళ్ళేగా ఆ రోజుల్లో స్నానానికి నీళ్ళు. హీటర్లు అవీ పెద్దగా వాడేవారు కాదు. కాగులూ మట్టిబానలూ వుండేవి.. నీళ్ళు కాచుకోవడానికి 'ఉన్న' వాళ్ళయితే రాగి బాయిలర్లు వాడేవారు. బాయిలర్‌కి బొగ్గులు కావాలి. అవి ఖరీదు అనుకునేవాళ్ళు పొట్టుపొయ్యిలో, కట్టెల పొయ్యిలో వాడేవారు. మా అమ్మ ఆల్‌రెడీ స్నానానికి వెళ్ళినట్టుంది. నేను గబగబాలేచి కచ్చికతో పళ్ళుతోముకున్నాను. పెద్దత్తయ్య తప్ప ఆల్‌మోస్ట్ అందరూ నిద్దరపోతున్నారు. ఇరావతి గురక ఐరావతపు ఘీంకారంలాగా వున్నది.

మా అమ్మ తడికెల బాత్రూం నించి బయటకి రాగానే నేనూ బట్టలు తీసుకుని బాత్రూంకెళ్ళాను. స్నానం చేద్దామని.

అయిదయింది. వద్దువద్దన్నా వినకుండా పెద్దత్త మాకు కాఫీ పెట్టి ఇచ్చింది. పాలు బదులు పాలపొడి వాడినట్లుంది. ఇళ్ళల్లో 'ఫ్రిజ్' వుండటం ఆ రోజుల్లో ఓ ఘనత. హాల్లో అందరికీ కనబడేట్టు ఆ ఫ్రిజ్‌ని ప్రదర్శించేవారు. కానీ అలాంటి ఘనత వహించిన కుటుంబాలు తక్కువే. మిక్సీలూ గ్రైండర్లూ కూడా లేవు. రుబ్బురాళ్ళూ పచ్చడిబండలే గతి. అయితే అవి సమృద్ధిగా 'ఆరోగ్యాన్ని' ప్రసాదించేవి (స్త్రీలకి జిమ్) లాంటివే రుబ్బురోళ్ళు, పచ్చడి బండలూ. ఇహ ఊడ్పులూ, దుమ్ము దులపటాలూ, ఇల్లు తుడవటాలూ, అంట్లు తోమడాలు ఇవన్నీ ప్రత్యేక వ్యాయామాలు. ఇక తిరగళ్ళ సంగతి చెప్పనే అక్కర్లేదు. ముగ్గురం సిద్ధమయ్యాక అమ్మ అన్నది. "ఏవండీ ఒక్కసారి మా నాన్నకి చెప్పివస్తానండీ" అని.

"ఆయన పడుకుని వుంటారు. ఏ తెల్లవారు ఝామునో పాపం నిద్రపట్టివుంటుంది. లేపటం ఎందుకూ?" అన్నారు నాన్న పెద్దత్తతో చెప్పి బేగ్‌ని సద్దుకుంటూ.

"సర్లెండి. పోనీ కాళ్ళకి దండం పెట్టివస్తా" అన్నది అమ్మ.

"సర్లే.. వెళ్ళిరా" నడవబోయినవాడు కాస్తా, మడతమంచం మీద కూర్చుంటూ అన్నాడు.

"నాన్నా" ఒక్క అరుపు అరిచింది అమ్మ. గబగబా నేనూ నాన్నా లోపలికి పరిగెత్తాం.

"వెళ్ళిపోయావా నాన్నా.. నువ్వూ" అంటూ గుండె బాదుకుంటూ అరుస్తోంది అమ్మ హిస్టీరిక్‌గా తాత చెయ్యిని పట్టుకుని చూశా. చల్లగా వుంది.

"ఆయనా పోయారమ్మా" అన్నాడు నాన్న. ఆలోపులోనే పెద్దత్తా మావయ్యలూ గబగబా లోపలికొచ్చారు లైటేశారు.

నిశ్చలంగా పడివున్నాడు తాతయ్య. కళ్ళు తెరుచుకునే వున్నాయి.. ఎవరినో చూస్తున్నట్టు. మరోసారి ఇల్లంతా ఏడుపులతో మారుమ్రోగింది.

అటుపక్క ఉదయిస్తున్న సూర్యుడు - ఇటు పక్క అస్తమించిన తాతయ్య.

ఏమని చెప్పనూ? ఒకసారి ప్రదర్శించిన జీవితనాటకాన్నే మరోసారి చూసినట్టుంది. మరణ చక్రం ఒకే ఇంట్లో పదమూడు రోజుల్లో రెండుసార్లు తిరిగింది.

"ఎంత అదృష్టవంతుడో.. నిద్రలోనే పోయారు"

"భార్యలేకుండా యీ వయసులో బతుకు యీడవడం అసాధ్యం. అందుకే హాయిగా ఆవిడని చల్లగా పంపించి తనూ వెళ్ళిపోయాడు."

"ఎంత మంచి మనుషులమ్మా ఇద్దరూ.. ఏనాడూ పరుష పదాలు అనుకుని ఎరగరు."

ఇవన్నీ జనాలు చేసే కామెంట్స్. మా అమ్మ మూగదైపోయింది. నాన్న నిశ్చేష్టుడయ్యాడు. నాలో ఏదో తెలీని భావం. బహుశా అది అశక్తతలోంచి వచ్చిన శక్తి కావొచ్చు. ఎవరో ఒకరు బాధ్యత తీసుకోవాలన్న నాకే తెలియని నాలోని 'ఇంగితం' కావొచ్చు.. నేను మాత్రం నిశ్చలంగా నిలబడ్డా.

"ఈ గ్లాసు మాత్రం నువ్వే వుంచుకోమ్మా.. మా ఇద్దరి గుర్తుగా" తాతయ్య మాటలు మళ్ళీ వినిపించాయి నా చెవిలో. అదిగో ఆయన్ని ఏడుకట్ల సవారీ మీద ఎక్కిస్తున్నారు. భగవంతుడా ఇదేనా జనన మరణలీల అంటే? ఏడుపు గుండెల్లోంచి తన్నుకొచ్చింది.

*(మళ్ళీకలుద్దాం)*

Post your comments